క్లుప్తంగా

రైతు కూలీ రాష్ట్ర సదస్సు విజయవంతం చేద్దాం

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 18వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న రైతు కూలీ రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని వక్తలు కోరారు. శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా రైతు కూలీ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉల్లిగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు రైతాంగ కార్మిక వ్యతిరేకమైనవి కార్పొరేట్ శక్తులకు అనుకూలమైనవి అని చెబుతూ ఈనాడు వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణం నేటి పాలకులే అని అన్నారు. జిల్లా నాయకులు నీలాది రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు కొండారెడ్డి చెన్నయ్య ,అనీలు, సిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని శ్రీ సాయి విహార్‌లోని షిరిడి సాయి బాబా సమేత ఆంజనేయ, విఘ్నేశ్వర, దత్తాత్రేయ, రాహు కేతు, శివలింగ, నవగ్రహ స్వామి పుష్కర వార్షిక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాలను గుదిమెళ్ల తిరుమల లక్ష్మణాచార్య స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ జానపాటి కిరణ్ శర్మ పర్యవేక్షణలో చేపట్టారు. 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. చివరి రోజు మధ్యాహ్నం మహా అన్నసంతర్పణ ఉంటుందని పేర్కొన్నారు.

రక్త దానంపై అవగాహన ఉండాలి



పిడుగురాళ్ల: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నరసరావుపేట ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో మొత్తం 15 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్స్ ప్రభావతి, రమాదేవి పాల్గొన్నారు.

భర్తపై భార్య బంధువులు దాడి

నరసరావుపేటటౌన్: భర్తపై భార్య తరుపు బంధువులు దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శనివారం తెలిపారు. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడుకు చెందిన సైకం శ్రీకాంత్‌రెడ్డికు నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీతో 2010లో వివాహం అయ్యింది. భార్య, భర్తలకు మధ్య మనస్పర్థలు వచ్చి గత కొన్ని నెలలుగా వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్ రెడ్డిపై శ్రీలక్ష్మీ కుటుంబ సభ్యులు ద్వేషం పెంచుకున్నారు. శనివారం నరసరావుపేటలోని జీబీఆర్ హాస్పటల్ వద్దకు వచ్చిన శ్రీకాంత్ రెడ్డిపై అతని భార్య బంధువులు నిమ్మల కృష్ణారెడ్డి, చందు మరి కొందరు దాడికి పాల్పడి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకోవటంతో వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పురుషోత్తమపట్నంలో శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వరిగడ్డి వాములో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక వాహనం ఆలస్యంగా కావడంతో, మంటలు వేగంగా వ్యాపిస్తుండటం గమనించిన స్థానికులు మంటలు చెలరేగకుండా ఉండేందుకు బక్కెట్లు, నీటి మోటార్లు, తమ ఇళ్లలోని పైపులతో అగ్నిని అరికట్టడానికి శ్రమించారు. దీంతో మంటల్ని అదుపులోకి రావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నూజెండ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఐనవోలు ఎస్సై ఎంవీ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంగినేని వెంకటేశ్వర్లు (54) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో జరిగిన చిన్నపాటి వివాదం జరిగింది. మనస్పర్థలతో అదే రోజు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ప్రయోజనం లేకపోవటంతో పోలీస్ స్టేషన్లో కంప్‌లెయింట్ ఇవ్వటం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం



కనపర్రులో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

శావల్యాపురం: మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి యోగాసనాలు ఎంతో దోహదపడతాయని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ఆరోగ్యకరమైన భారతదేశం తేవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతిరోజు యోగాసనాలు కోసం గంట సమయం కేటాయించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, ఏపీఓ జి.వాసుబాబు, ఏపీయం కె.రామారావు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత యోగా వల్లే సాధ్యం

రొంపిచర్ల: మానవుడికి యోగాసనాలు ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తాయని ఎంపీడీఓ కె. మాథ్యూబాబు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన సామూహిక యోగాసనాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవుని దయనందిక జీవితంలో యోగాసనాలను ఒక నిత్య కార్యక్రమంగా అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని చెప్పారు. కనీసం అరగంట పాటు యోగా చేయటం వలన ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చని వివరించారు. అలాగే మండలంలోని అన్ని సచివాలయాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలోభాగంగా స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శీతారామయ్య, పర్యవేక్షణలో సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమానికి ఎంపీపీ బత్తిగురవయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ యోగావల్ల మానసిక ప్రశాంతతోపాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: ప్రతిరోజూ యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమౌతుందని యోగాచార్యులు, కనపర్రు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వై.రాజ్యలక్ష్మి చెప్పారు. కనపర్రు, గణపవరం, నాదెండ్లతో పాటూ మరికొన్ని పాఠశాలల్లో మాక్ యోగాడే నిర్వహించారు. విద్యార్థులతో పాటూ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నతనం నుంచే యోగాభ్యాసం చేస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. క్రమశిక్షణ, పోషకాహారం, యోగా, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతాయన్నారు.

ఏఎంజీలో..

చిలకలూరిపేటటౌన్: స్థానిక ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం మాక్ యోగా డే కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్, మండల విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు, ఏడవ వార్డు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంతో యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఈటీ రాజు యోగా ప్రయోజనాలను వివరిస్తూ, వివిధ ఆసనాలను ప్రదర్శించి, అందరికీ అభ్యాసం చేయించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందస్తు సంసిద్ధతగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సచివాలయ అడ్మిన్ సాగర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె కృపాదానం, సచివాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

రావిపాడు యోగా శిక్షణ శిబిరం

నరసరావుపేట రూరల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగ శిక్షణా శిబిరాన్ని మండలంలోని రావిపాడులో శనివారం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో సచివాలయ, రెవెన్యూ, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి దైనందిన కార్యక్రమంలో యోగ భాగం కావాలని తెలిపారు. ప్రతిరోజు కనీసం గంట పాటు యోగాసనాలు సాధన చేయాలని తెలిపారు. దీనివల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని తెలిపారు.

నరసరావుపేట వాసికి రక్తదాన ప్రేరకుడి అవార్డు

మంత్రి సత్యకుమార్ అందజేత



శ్రీనివాసరావుకు అవార్డు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్

నరసరావుపేట: వ్యక్తిగత రక్తదాన ప్రేరకుడిగా నరసరావుపేటకు చెందిన ఆర్.శ్రీనివాసరావు రాష్ట్ర అవార్డు అందుకున్నారు. గుంటూరులోని విద్యాభవన్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మనిషి ప్రాణాలను కాపాడే రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేరని, అందువలన రక్తదానం నలుగురి ప్రాణాలు కాపాడుతుందని అన్నారు. శ్రీనివాసరావు కరోనా సమయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా వృద్ధులకు అన్నదానం, అవసరమైన వారికి రక్తదానం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం మంచి పరిణామం అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ ఈడీ రామారావు, అశ్వనీ, ఫరీదా పాల్గొన్నారు.

కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులుగా డోగిపర్తి

కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



ఎమ్మెల్యే చదలవాడను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

నరసరావుపేట: నరసరావుపేట వాసవీ కిరాణా మర్చంట్ అసోసియేషన్ (టూ టౌన్) కమిటీ సభ్యులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దోగిపర్తి విజయ్‌కుమార్, కోశాధికారి పంతంగి శ్రీనివాసరావు, ట్రెజరర్ చిలకల రామసుబ్బారావు నియమితులయ్యారు. సత్తెనపల్లి రోడ్డులోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై అభినందనలు తెలియచేశారు. ఆయనను కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి పూలదండలతో సత్కరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెరుమళ్ళ సత్యనారాయణ, ఆత్మకూరి శ్రీనివాసరావు, గాదంశెట్టి వెంకటేశ్వరరావు, ఆతుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరంలో మార్మోగిన శ్రీరామ నామం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన శ్రీ కోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారులు దర్భి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ శర్మలు స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గ్రామంలో సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన కోదండరామాలయం శిథిలావస్థకు చేరటంతో నూతన ఆలయం నిర్మించి 2023 జూన్ 7న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిచే విగ్రహం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ శుద్ధి, అభిషేకాలు, అర్చనలు, అగ్నిప్రతిష్ఠాపన, లక్ష్మీసుదర్శన హోమం , సాయంత్రం స్వామివారికి కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గణపవరం గ్రామానికి చెందిన మాస్టర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మహిళలచే కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

'ఎత్తిపోతల'కు వేగంగా మరమ్మతులు

అచ్చంపేట: మండలంలోని గ్రంధశిరిలో 2010లో నిర్మించిన ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ స్కీం ద్వారా 5 గ్రామాలకు చెందిన 30 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. పైపులైన్లకు లీకులు ఏర్పడంతో సక్రమంగా నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆయకట్టు రైతులతో మాట్లాడి స్కీం మరమ్మతుల కోసం సుమారు రూ.20 లక్షల విరాళాలను సేకరించినట్లు సంగం డైయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు తెలిపారు. ఆ మొత్తంతో పనులు చేపట్టామని పేర్కొన్నారు. స్కీముకు విద్యుత్ సక్రమంగా సరఫరా అయ్యేందుకు అధికారులతో మాట్లాడి క్రమబద్ధీకరించే పనిలో ఉన్నామన్నారు. రానున్న ఖరీఫ్, రబీ సీజన్లకు స్కీం ద్వారా ఆయకట్టుదారులకు సమృద్ధిగా సాగునీరు ఇచ్చే ధ్యేయంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ఆయకట్టు రైతులకు, స్కీము నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంపుదలకు చర్యలు చేపట్టాలి

శావల్యాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోల విద్యార్థుల సంఖ్య పెంపుదలకు చర్యలు చేపట్టినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2025-26 విద్యా సంవత్సరం నాటికి 2828 మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందజేశామన్నారు. యూనిఫాం, బూట్లు కూడా త్వరలో విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో ఎంపీపీ స్కూల్లో 57 మంది ఉపాధ్యాయులు ఉండగా 30 మంది బదిలీ అయ్యాయని వీరి స్థానంలో నూతన ఉపాధ్యాయులు 16న వారికి కేటాయించిన స్కూల్లో జాయిన్ అవుతారన్నారు. మండలంలో శావల్యాపురం, మతుకుమల్లి రెండు కాంపెక్సులు ఉన్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యం ప్రభుత్వం సరఫరా చేసినట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు.

అర్హత ఉన్న రైతులకు రుణాలు

శావల్యాపురం: రానున్న ఖరీఫ్ సీజనుకు కారుమంచి సొసైటీ పరిధిలో అర్హత కల్గియున్న రైతులందరికీ రుణాలు మంజూరు చేస్తామని సొసైటీ సీఈవో వైవీ నారాయణ శనివారం తెలిపారు. తమ పరిధిలో మూడు గ్రామాలు, 2200 మంది రైతులు ఖాతాదారులు ఉన్నట్లు వెల్లడించారు. సొసైటీ పరిధిలో ఈఖరీఫ్ సీజనుకు రూ. 6 కోట్లు వ్యవసాయ అనుబంధ రుణాలు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు.

పల్నాడు ప్రాంతంలో సినీ పరిశ్రమ అభివృద్ధి చేయాలి

మాచర్ల: పల్నాడు ప్రాంతంలో సినీ పరిశ్రమ అభివృద్ధి చేయాలని సినీ నటుడు, టీడీపీ నాయకుడు షేక్ రఫీ అహ్మద్ కోరారు. శనివారం పట్టణంలో ఓ ప్రైవేటు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నీటితో వరి పండించే భూములు షూటింగ్‌కు అనువైన ప్రాంతమని చెప్పారు. చిత్ర పరిశ్రమకు భూములు కేటాయిస్తే పల్నాడు ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. పర్యాట రంగానికి ప్రభుత్వం పారిశ్రామిక స్టేటస్ ఇచ్చిందన్నారు. శ్రీకాళహస్తి నుంచి గుంటూరు నుంచి రైల్వే రైలు మార్గం ఏర్పాటు చేస్తున్నారన్నారు. మాచర్ల, నల్గొండ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా నాగర్జున సాగర్ మీదుగా ఏర్పడుతుంది. కాబట్టి రవాణా వసతికి ఇబ్బంది ఉండదని అభిప్రాయపడ్డారు. ఎత్తిపోతల జలపాతం సుందరమైన దృశ్యం ఇక్కడ అనేక చిత్రాలు నిర్మించిన సందర్భాలు ఉన్నాయన్నారు. అనుపు వద్ద బోట్ షికారుకు అనువైన సుందరమైన లొకేషన్ మాచర్లలో ప్రార్థన చెన్నకేశవ స్వామి దేవాలయం కూడా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్ పల్నాడు జిల్లా నుండి వెళ్తుందని, నాగార్జున సాగర్ కుడి కాలువ పల్నాడు ప్రాంతంలో నుండి వెళుతుందన్నారు. సువిశాలమైన నల్లమల అటవీ ప్రాంతం సినిమా షూటింగ్‌లకు అనువైనదన్నారు. ఇక్కడి పల్లెటోళ్ల తండాలు 7080 దశకంలో ఉండి షూటింగ్లకు చాలా అనుకూలంగా ఉన్నాయని ఈ సందర్భంగా చెప్పారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ



దాచేపల్లి: ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 510 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారందరికి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్లజోళ్లని సంస్థ వ్యవస్థాపకులు నాగెండ్ల సుమతీరత్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు బుర్రి కృష్ణారెడ్డి, నాగెండ్ల జయ, మాతంగి రాంబాబు పాల్గొన్నారు.

20 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

రెంటచింతల: రైతులందరూ ఈ నెల 20వ తేదీ లోగా అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కౌలు రైతులు కూడా వారి ఆధార్ జిరాక్స్, పాస్‌సైజ్ ఫొటో, రైతు సంబంధించిన పట్టాదార్ పాస్‌బుక్ నకలును తీసుకువెళ్లి వారి గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో), ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లికి చెందిన వి.నాగేశ్వరరావు, రాహేలు దంపతులకు వారధి ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆర్థికసాయం అందజేశారు. నాగేశ్వరరావు, రాహేలు దంపతులు అనారోగ్యం బారిన పడ్డారు. విషయం తెలుసుకున్న వారధి పౌండేషన్ వ్యవస్థాపకుడు తగరం ఆనంద్‌కుమార్ నాగేశ్వరరావు దంపతులకు వైద్య కోసం అండగా ఉండేందుకు ముందుకు వచ్చారు. నాగేశ్వరరావు, రాహేలు వైద్యఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ ద్వారా రూ.22 వేలు నగదు, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి చెట్టిపాగు ఏసుదానం, పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్, సంఘ పెద్దలు వినుకొండ బాబు, శ్రీపతి కాశయ్య, మీసాల నతానియేలు, మీసాల ఇర్మియా, పౌండేషన్ సభ్యులు వట్టెపు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, వలి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యుత్ ఏఈ షేక్ మస్తాన్‌వలి

రెంటచింతల: సౌర విద్యుత్‌ను అందరికీ చేరువ చేసి సుస్థిర ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి కోరారు. శనివారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు కాలనీలలో ఆయన పర్యటించారు. పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకం గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తుందన్నారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. 200 యూనిట్లు లోపు విద్యుత్‌ను వినియోగించుకుంటున్న ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇతరులు ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకున్నా రూ.18 వేలు సబ్సిడీ, రెండు కిలోవాట్లు సోలార్‌ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలు, మూడు కిలోవాట్లు సోలార్‌ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. విద్యుత్ కనెక్షన్ కలిగిన సొంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని కలిసి సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఓసీ, బీసీ వర్గాలకు చెందిన 326 మందితో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు రెండు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఏఈ వివరించారు.


కౌలుదారులు సకాలంలో కౌలు చెల్లించాలి



కౌలుదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ రామిరెడ్డి

రెంటచింతల: పాలువాయి గ్రామంలోని దేవుని మాణ్యాలు, సత్రశాల ఎండోమెంట్ భూములు, బంగ్లా దగ్గర ఉన్న తుమ్మకోట శివాలయం భూములను కౌలుకు తీసుకున్న కౌలురైతులు సకాలంలో దేవదాయశాఖకు కౌలు చెల్లించాలని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని పాలువాయి గ్రామ సచివాలయంలో ఆయా భూముల బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ కౌలు చెల్లించే విధానం వివరిస్తూ కౌలు హక్కు పొందిన వారు ముందుగానే ప్రతి సంవత్సరం కౌలు చెల్లించి భూమిలో ప్రవేశించాల్సి ఉంటుందని చెప్పారు. వేలంపాటలో పాట పాడుకున్న వారు కౌలు ఎండోమెంట్ వారికి సకాలంలో చెల్లించని ఎడల వారి కౌలు హక్కును రద్దు చేయు అధికారం దేవదాయశాఖ అధికారులకు ఉందన్నారు. వేలంపాట పాడుకున్న కౌలుదారులు ఎండోమెంట్ అధికారులకు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా రంగనాయక స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సొలసలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి

యడ్లపాడు: చరిత్రకు సాక్షిగా నిలిచిన సొలస గ్రామం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది. మానసిక మాధుర్యానికి, ఆధ్యాత్మిక విభూతికి కేంద్రబిందువై మెరిసింది. శనివారం గ్రామంలోని శ్రీరంగ నాయకస్వామి దేవస్థానం(14 జూన్ 1887) ప్రతిష్ఠ జరిగి 140 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ దివ్య వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం ధర్మకర్తల పర్యవేక్షణలో పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాయక స్వామి కొలువుదీరిన పుణ్యభూమి ఇందుకు వేదికైంది. ఉదయం 9 గంటల శుభముహూర్తాన ప్రారంభమైన కళ్యాణ వేడుక, వేద మంత్రాల పఠనం, మంగళ వాయిద్యాల ధ్వనులతో దేవస్థానం ప్రాంగణం పులకించిపోయింది. ముందుగా ఉత్సవ మూర్తులను వీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ శుభఘట్టానికి ధర్మకర్తలైన అర్వపల్లి గిరీష్-శారద, కొల్లూరు హరికృష్ణ వెంకటకోటేశ్వరరావు-కోటినాగచంద్రిక దంపతులు స్వామివారి కళ్యాణకర్తలుగా వ్యవహరించి ధన్యులయ్యారు. ధర్మకర్త వెంకటస్వామి నేతృత్వంలో గ్రామ పెద్దల సహకారంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయంతంగా ముగిశాయి.